సాక్షి నల్లగొండ

శుక్రవారం। 13। జనవరి। 2023

I



పండుగకు వెళ్లండిలా..
సంక్రాంతికి జనం సొంతూళ్లకు వెళ్తున్నారు. ప్రమాదాల నివారణకు పోలీసు, జీఎమ్మార్ అధికారులు చర్యలు చేపట్టింది. - IIలో



త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు
సూర్యాపేటలో గురువారం రాత్రి త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. - IIలో

గరిష్టం/కనిష్టం
31.0°/15°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రక్తదాతలకు కృతజ్ఞతలు

నల్లగొండ క్రైం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌ స్టేషన్లలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలకు తరలి వచ్చి రక్తం దానం చేసిన వారికి ఎస్పీ రెమో రాజేశ్వరి ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో కలిపి మొత్తం 150 యూనిట్ల రక్తం అందజేసినట్లు పేర్కొన్నారు. యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని మంచిమార్గంలో ముందుకు సాగాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ ఖుష్బూ

నల్లగొండ టూటౌన్‌: విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్‌ ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్‌, బ్యాడ్మింటన్‌ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రీడల్లో పాల్గొనడం ద్వారా దేహదారుఢ్యం పెరిగి మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మగ్బూల్‌ అహ్మద్‌, కిరణ్‌కుమార్‌, నారాయణ, రామకృష్ణ, నజీర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఠాక్రేను కలిసిన శంకర్‌నాయక్‌



పూలబొకే అందజేస్తున్న శంకర్‌నాయక్‌

నల్లగొండ: రాష్ట్ర కాంగ్రెస్‌ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలను గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు కేతావత్‌ శంకర్‌నాయక్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఠాక్రేను శాలువాతో సన్మానించి పూలబొకే అందజేశారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభులకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజలు చేపట్టారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

పండుగ రద్దీ..

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం పాఠశాలలకు ఐదు రోజులపాటు సెలవులు ప్రకటించింది. విద్యార్థులు గురువారమే తమ సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో నల్లగొండ బస్టాండ్‌ రద్దీగా మారింది. పండుగకు వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించారు.
- సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్‌ నల్లగొండ





నల్లగొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు, ప్రయాణికులు, బస్సుల కోసం ఎదురు చూస్తున్న జనం

స్కూళ్లలో సంక్రాంతి

నల్లగొండలోని విపస్య స్కూల్‌లో గురువారం ముందస్తుగా నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు



వందశాతం లక్ష్యంగా..

పంచాయతీల్లో పన్నుల వసూలు ముమ్మరం
- లక్ష్యం రూ.15.31 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.5.37కోట్లు
- మార్చి నెలాఖరు వరకు గడువు

నల్లగొండ: గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నుల వసూలు చేయాలనే లక్ష్యంతో యంత్రాంగం ముందుకు సాగుతోంది. దీంట్లో భాగంగా 2022–23 సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్ల ప్రక్రియను ముమ్మర చేసింది. గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయం వనరు పన్నులే కావడం, నూటికి నూరుశాతం వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా ఇంటి, తాగునీటి పన్నులతోపాటు వాణిజ్య దుకాణాలు, ఫ్యాక్టరీలు, లైసెన్స్‌ ఫీజు వసూలు చేస్తున్నారు.



కార్యదర్శుల ఆధ్వర్యంలో..
జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మాత్రమే వస్తున్నాయి. అవి కూడా జనాభా ఆధారంగా వస్తుండడంతో అభివృద్ధి పనులకు సరిపోని పరిస్థితి. కొన్ని పంచాయతీల్లో మెయింటనెన్స్‌కే డబ్బులు సరిపోవడంలేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. దీంతో గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన పన్నుల వసూళ్లను చేసుకొని పంచాయితీలు అభివృద్ధిలో ముందడుగు వేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో 2018 నుంచి కార్యదర్శుల ఆధ్వర్యంలో పన్నులు వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రామ పంచాయతీల్లోని ఆస్తులన్నింటినీ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. దీంతో పన్ను నిర్ణయించి డిమాండ్‌ నోటీసులు ఇచ్చి వసూలు చేస్తున్నారు.

వసూళ్లు 35 శాతమే ..
జిల్లాలో ఇప్పటివరకు పంచాయతీల ఆస్తి పన్ను 35 శాతం వసూలు చేశారు. అయితే రూ.15.31కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ5.37 కోట్లు వసూలు చేశారు. మార్చి వరకే గడువు ఉండంతో వసూళ్లను ముమ్మరం చేశారు.

వందశాతం వసూలు చేయాల్సిందే..
పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాల్సిందే. పన్నులు పూర్తిస్థాయిలో చెల్లించిన పంచాయతీలకే నిధులు కూడా వచ్చే అవకాశం ఉంది. సిబ్బందికి మార్చిలోగా నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలి.
– విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీఓ, నల్లగొండ

పన్నుల వసూలు ఇలా (రూపాయల్లో..)

మండలం	లక్ష్యం	వసూళ్లు	మండలం	లక్ష్యం	వసూళ్లు	మండలం	లక్ష్యం	వసూళ్లు
అడవిదేవులపల్లి	25,49,782	10,46,982	కనగల్	30,64,612	15,08,838	నార్కట్‌పల్లి	13,32,1371	56,00042
అనుముల	41,65,322	15,35,450	కట్టంగూర్	90,96,864	23,22,599	నేరడుగొమ్ము	16,31,603	15,27,211
చందంపేట	18,16,060	2,96,000	కేతేపల్లి	39,12,710	9,52,203	నిడమనూరు	47,21,327	17,94,479
చండూర్	53,01,182	20,08,020	కొండమల్లేపల్లి	49,42,894	14,82,868	పెద్ద అడిశర్లపల్లి	34,35,464	4,67,883
చింతపల్లి	83,58,831	24,13,662	మాడ్గులపల్లి	44,65,786	10,75,066	పెద్దవూర	33,55,034	12,22,211
చిట్యాల	52,83,667	25,07,010	మర్రిగూడ	40,43,146	8,85,112	శాలిగౌరారం	76,72,396	36,51,231
దామరచర్ల	89,96,480	48,11,517	మిర్యాలగూడ	96,98,294	42,86,880	తిప్పర్తి	28,39,185	12,11,510
దేవరకొండ	39,88,237	6,21,860	మునుగోడు	42,81,340	12,77,974	తిరుమలగిరిసాగర్	37,83,437	10,10,443
గుండ్లపల్లి	33,95,927	4,12,683	నకిరేకల్	22,55,093	9,45,769	త్రిపురారం	56,71,849	14,37,909
గుర్రంపోడు	41,74,080	3,25,000	నల్లగొండ	64,72,758	26,85,103	వేములపల్లి	35,79,557	11,11,481
			నాంపల్లి	28,44,200	13,26,548	మొత్తం	15,31,19,488	5,37,61,544

28 నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పాల్గొన్న జెడ్పీ, గ్రంథాలయ చైర్మన్లు, అదనపు కలెక్టర్‌

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- నకిరేకల్‌ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్‌ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : ఈ నెల 28 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు జరగనున్న చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు గత ఏడాది కన్నా ఈ ఏడాది మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నకిరేకల్‌ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్‌ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్‌ భాస్కర్‌రావు అధ్యక్షతన దేవాలయ ఆవరణలో నిర్వహించిన సమన్వయం సమావేశంలో వారు మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు ఈ ఏడాది దాదాపు లక్ష మంది వరకు భక్తులు రావచ్చని, ప్రతిఒక్కరూ మాస్క్‌ ధరించేలా, భక్తులు ఇబ్బందులు పడకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలన్నారు. మాస్క్‌లను వైద్య సిబ్బంది ఉచితంగా ఇవ్వాలని ఆదేశించారు. వృద్ధులు, చిన్నారులు, గట్టుపైకి వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. బ్రహ్మోత్సవాల గురించి ఇతర జిల్లాల్లోనూ ప్రచారం నిర్వహించాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. కల్యాణ మండపం వద్ద పనులు జరుగుతున్నందున వార్షిక కల్యాణం ఎక్కడ నిర్వహించాలనేది త్వరలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, సర్పంచ్‌ మల్లబాలకృష్ణ, ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్‌ మురళీధర్‌, కార్యనిర్వహణ అధికారి నవీన్‌కుమార్‌, దేవాలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, కొండూరు శంకర్‌ పాల్గొన్నారు.

ఆహార సబ్సిడీలను ఎత్తివేయొద్దు

నల్లగొండ టౌన్‌: ఆహార సబ్సిడీలను ఎత్తివేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్‌ చేశారు. నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో గురువారం జరిగిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అవలంబిస్తున్న తప్పుడు విధానాల వల్ల దేశంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినేటికీ అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి అయిలయ్య, జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, దండెంపల్లి సరోజ, పిల్లుట్ల సైదులు, చింతపల్లి లూర్దుమారయ్య, మన్యం భిక్షం, గండమల్ల రాములు, చెరుకు పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

‘రైతుబంధు’కు దరఖాస్తు చేసేదెట్లా..!

- జూలై మొదటి వారం నుంచి ఓపెన్‌కాని సైట్‌
- జూన్‌ 30 వరకు వచ్చిన పట్టదారు పుస్తకాలకే ఆన్‌లైన్‌ ప్రక్రియ పూర్తి
- కొత్తగా పాస్‌బుక్కులొచ్చిన వారికి దక్కని అవకాశం
- ఎదురుచూపుల్లో 17 వేల మంది రైతులు



నల్లగొండ అగ్రికల్చర్‌: రైతుబంధు సైట్‌ ఓపెన్‌ కావడం లేదు. దీంతో కొత్త పాస్‌బుక్కులు చేతికొచ్చినప్పటికీ రైతుబంధుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా జిల్లాలో వేలాది మంది రైతులకు రైతుబంధు అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత యాసంగిలో పదవ విడత రైతుబంధు పథకం డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే కొత్తగా అంటే గత ఏడాది డిసెంబర్‌ 20 నుంచి ఈ నెల 7వరకు కొత్త పాస్‌బుక్కులు వచ్చిన రైతులు రైతుబంధు పథకం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అయి తే దరఖాస్తుతో పాటు పాస్‌బుక్కు, బ్యాంక్‌ అకౌంట్‌, ఆధార్‌ జిరాక్స్‌లను ఏఈఓలకు అందజేసి రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేయించుకోవాల్సి ఉంది. కానీ గత సంవత్సరం జూన్‌ 30 వరకు వచ్చిన పాస్‌ బుక్కుల వివరాలు మా త్రమే రైతుబంధు సైట్‌లో నమోదు చేసి ఉన్నా యి. ఆ తరువాత వచ్చిన పాస్‌బుక్కుల వివరాలను సీసీఎల్‌ఏ నుంచి వ్యవసాయశాఖకు అందలేదు. దీంతో జూలై మొదటి వారం నుంచి వచ్చిన కొత్త పాస్‌ బుక్కులు వచ్చిన వారి వివరాలను నమోదు చేయడానికి సైట్‌ ఓపెన్‌ కావడం లేదు.

కొత్తవారి వివరాలు అందకపోవడంతో..
జిల్లాలో వివిధ సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించడంతో భూములు కొనుగోలు చేసుకున్న సుమారు 17వేల మంది వరకు రైతులకు కొత్తగా పాస్‌బుక్కులు వచ్చినట్లు సమాచారం. వారందరి వివరాలను సీసీఎల్‌ఏ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు అందకపోవడంతో ఆ పాస్‌బుక్కుల వివరాలు రైతుబంధు పోర్టల్‌లో లేదు. దీంతో జిల్లాలో పాస్‌బుక్కుల వచ్చిన రైతులు సుమారు 8వేల మంది వరకు వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద రైతుబంధుకు దరఖాస్తులు అందజేశారు. మిగతా వారు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయినప్పటికీ డిసెంబర్‌ 10 నుంచి నేటివరకు కూడా రైతుబంధు సైట్‌ ఓపెన్‌ కాకపోవడంతో వ్యవసాయాధికారులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. సీసీఎల్‌ఏ చేసిన తప్పిదం వల్ల జిల్లాలోని సుమారు 17వేల మంది రైతులకు రైతుబంధు అందేలా లేదు. సైట్‌ ఓపెన్‌ అయితేనే కొత్తపాస్‌బుక్కులు వచ్చిన వారి వివరాలను రైతుబంధు పథకంలో నమో దు చేయడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే సీసీ ఎల్‌ఏ నుంచి కొత్తపాస్‌బుక్కులు పొందిన రైతు ల వివరాలను తెప్పించుకుని రైతుబంధు సైట్‌ ఓపెన్‌ అయ్యేలా చూసి యాసంగిలో రైతుబంధు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఇప్పటికే రూ.344.11 కోట్లు జమ
పదవ విడత యాసంగి సీజన్‌ రైతుబంధు పథకం డబ్బులను గతనెల 28 నుంచి రైతుల ఖాతాల్లో విడతల వారీగా ప్రభుత్వం జమ చేస్తోంది. ఇప్పటి వరకు 3,98,236మంది రైతుల ఖాతాల్లో 344.11 కోట్లు జమ అయ్యాయి. అయితే ముందుగానే ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుబంధు లబ్ధిదారులు 4,71,968 మందికి సంబంధించి రూ.544 కోట్ల 26లక్షల 43 వేల 358 రూపాయలను ట్రెజరీలో జమచేసింది. ముందు ఎకరం, తరువాత రెండు ఎకరాలు, ఆ తరువాత మూడు ఎకరాల చొప్పున దశల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.


18న యాదాద్రికి జాతీయ నేతలు

- ఖమ్మంలో బీఆర్‌ఎస్‌ సభ రోజున లక్ష్మీనర్సింహస్వామి దర్శనం
- సీఎం వెంట రానున్న నాయకులు

సాక్షి, యాదాద్రి: ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్‌ సభ వెళ్తూ వివిధ రాష్ట్రాల సీఎంలు, జాతీయ స్థాయి నేతలు, సీఎం కేసీఆర్‌ ఈ నెల 18న యాదాద్రికి రానున్నారు. ఢిల్లీ, పంజాబ్‌, కేరళ సీఎంలు అరవింద్‌ కేజ్రీవాల్‌, భగవంత్‌ మాన్‌, పినరయి విజయన్‌, యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌ వాద్‌ పార్టీ అధినేత అఖిలేష్‌ యాదవ్‌తోపాటు మరికొంత మంది నాయకులు 17న హైదరాబాద్‌కు రానున్నారు. 18 ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు చేరుకుని శ్రీస్వామి వారి దర్శనం చేసుకుంటారు. యాదాద్రి ప్రధానాలయ ఉద్ఘాటనకు జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానిస్తామని గతంలో సీఎం ప్రకటించారు. అయితే అనివార్య కారణాల వల్ల అప్పట్లో జాతీయ స్థాయి నాయకులు ఎవరూ రాలేదు. ఇప్పుడు ఖమ్మం బీఆర్‌ఎస్‌ బహిరంగ సభ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో వస్తున్న జాతీయ నాయకులను యాదాద్రి సందర్శనకు తీసుకువస్తున్నారు. యాదాద్రిలో స్వామి దర్శనం అనంతరం ఖమ్మం బహిరంగ సభకు వెళ్లనున్నారు. అయితే, అధికారికంగా ఇంకా ఆదేశాలు రాలేదని దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

కళ్లద్దాలు వచ్చేశాయ్‌

జిల్లాకు చేరిన 65,918 కంటి అద్దాలు
- 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం
- ఏర్పాట్లు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ
- వారంలో ఐదు రోజులు పరీక్షలు చేసేలా ప్రణాళిక
- ఇప్పటికే సిబ్బందికి పూర్తయిన శిక్షణ



నల్లగొండ టౌన్‌: జిల్లా వ్యాప్తంగా రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది. కార్యక్రమం ఈ నెల 18న లాంఛనంగా ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా జిల్లాలోఅవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో 18,12,626 మంది జనాభా ఉండగా అందులో 40 శాతం మందిగా ఉన్న 18ఏళ్లు నిండిన వారు సుమారు 8లక్షల మందికిపైగా ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించనున్నారు. మొదటి దశలో భాగంగా ఇప్పటికే జిల్లాకు 65,918 ఐదు రకాల కంటి సైట్‌ అద్దాలు వచ్చాయి. పరీక్షలను నిర్వహించడానికి 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు అర్బన్‌ హెల్త్‌ సెంటర్లు కలిపి మొత్తం 39 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 74 బృందాలను నియమించింది. ఒక్కో బృందంలో మెడికల్‌ ఆఫీసర్‌తో పాటు పారామెడికల్‌ ఆప్తాలమిస్ట్‌ ఆఫీసర్‌, డాటా ఎంట్రీ ఆపరేటర్‌, సూపర్‌వైజర్‌, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశా వర్కర్లు ఉంటారు.

జిల్లా జనాభా	పరీక్షించాల్సినవారి సంఖ్య సుమారు
18.12లక్షలు	8లక్షలు
కంటి పరీక్షల కేంద్రాలు 39	నియమించిన బృందాలు 74

సిబ్బందికి పూర్తయిన శిక్షణ..
జిల్లాలో ఇప్పటికే ప్రోగ్రాం, మెడికల్‌ ఆఫీసర్లకు జిల్లా స్థాయిలో, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌ స్థాయిలో కంటివెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పరీక్షలు నిర్వహించే బృందాలకు శిక్షణ కార్యక్రమాలను కూడా పూర్తి చేశారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ఇప్పటికే కంటి వెలుగు కార్యక్రమంపై విరివిగా ప్రచారం నిర్వహించారు. అలాగే ఎంపీ స్థాయి నుంచి మున్సిపల్‌ కౌన్సిలర్‌ వరకు అందరు ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. వీరితోపాటు పట్టణాల్లో మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్‌ శాఖ సహాయ సహకారాలు తీసుకుంటారు. అయితే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయి అధికారితో పాటుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సూపర్‌వైజర్లు ప్రతిరోజూ పర్యవేక్షించనున్నారు.

25వేల జనాభాకు ఒక బృందం..
25 వేల జనాభాకు ఒక బృందం చొప్పున నియమించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతిరోజూ 400 మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 300 మందికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. వారంలో ఐదు రోజులు మాత్రమే కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, డ్రాప్స్‌, ఇతర మందులను ఉచితంగా అందజేస్తారు. వంద రోజుల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

వంద రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక



జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వంద రోజుల్లో కార్యక్రమాన్ని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాం. కంటి పరీక్షలను చేయడానికి అవసరమైన మిషన్లు, కంటి అద్దాలు వచ్చాయి.
–డాక్టర్‌ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

కల్వకుంట్లలో చెరువు కట్ట ధ్వంసం

- రెండు రోజుల క్రితం ఘటన
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన రైతులు

మునుగోడు: మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో గల కాసారాజుకుంట చెరువు కట్టను ధ్వంసం చేశారు. రెండు రోజుల క్రితం ఆ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు జేసీబీతో కట్టను ధ్వంసం చేసి చదును చేశారు. దీంతో వర్షాకాలంలో వరదనీరు వచ్చి చేరితే నీరు నిల్వ ఉండకపోగా ఆ చెరువు కింది భాగంలో తమ పొలాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఆ గ్రామంలోని సర్వే నంబర్‌ 227, 228లో దాదాపు 24 ఎకరాల భూమిలో 30 ఏళ్ల క్రితం ఎనిమిది మంది రైతులు ప్రభుత్వ నిధులతో తమ ఇష్టపూర్తిగా చెక్‌ డ్యాంతో పాటు చెరువు కట్టను నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి ఏటా వర్షాలు వచ్చిన సమయంలో వరద వచ్చి నీరు నిల్వ ఉంటోంది. అయితే ఈ కుంటను ఐదేళ్లకోసారి చిన్న నీటిపారుదలశాఖ, ఉపాధి హామీ అధికారులు మరమ్మతులు చేబడుతున్నారు.



ధ్వంసం చేసి చదును చేసిన చెరువు కట్ట

కట్ట అవసరం లేదని..
అయితే ఈ ఎనిమిది మంది రైతుల్లో ముగ్గురు మాకు కుంట అవసరం లేదని, కట్టను ధ్వసం చేసి ఆ భూమిలో పంటలు సాగు చేసుకుంటామని ఓ జేసీబీని అద్దెకు తీసుకొచ్చి ధ్వసం చేశారు. అందులో ఆ గ్రామ ఫీల్డ్‌ అసిటెంట్‌ కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. దానిని గమనించిన మిగతా రైతులు గత బుధవారం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు అందించగా ఆయన వెంటనే స్పందించి ఆర్‌ఐ చేత పంచినామా చేయించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న కుంట కట్టను ధ్వసం చేయడం చట్టపరంగా నేరమని, మట్టి పోయించి కట్టను యథావిధిగా చేయించాలని ఆదేశించారు. కానీ కట్టను ధ్వంసం చేసిన రైతులు మాత్రం దానిని చదును చేయకుండా మిగిలిన దాన్ని కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయమై చిన్న నీటిపారుదల శాఖ అధికారులను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని, త్వరలో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కుంటలో నీరు నిల్వ ఉండేలా కట్ట పోయించాలని మిగతా రైతులు వేడుకుంటున్నారు.

పండుగకు వెళ్లండిలా..

- సంక్రాంతికి హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్తున్న జనం
- 65వ నంబర్ జాతీయ రహదారిపై పెరిగిన వాహనాల రద్దీ
- హైవేపై పలు చోట్ల యాక్సిడెంట్ స్పాట్‌లు
- ఆచితూచి వెళ్లాలంటున్న పోలీసులు

చౌటుప్పల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా మారింది. ఒకేసారి వేలాది వాహనాలు ఒకే వైపు వెళ్తుండడంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అవుతుంది. వందల కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగిస్తున్న క్రమంలో ముందుచూపుతో వ్యవహరిస్తే సాఫీగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు.

ఫాస్టాగ్ చూసుకోకుంటే కష్టాలే

ఫాస్టాగ్ అమలులోకి వచ్చాక టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరే పరిస్థితి చాలా మేరకు తగ్గింది. కొద్ది మంది మినహాయిస్తే దాదాపు వాహనదారులంతా ఫాస్టాగ్ తీసుకున్నారు. ఫాస్టాగ్‌లో డబ్బులు లేకపోయినా, అకౌంట్ స్తంభించినా టోల్ ప్లాజాల వద్ద ఇబ్బంది తప్పదు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ఇంటి నుంచి బయల్దేరే ముందే ఫాస్టాగ్‌ను చూసుకుంటే ఇబ్బందులు తలెత్తవు. లేదంటే టోల్‌ప్లాజాల వద్ద రెండింతల రుసుం చెల్లించాల్సి వస్తుంది. పంతంగి టోల్‌ప్లాజా మీదుగా సాధారణ రోజుల్లో ఇరువైపులా 30 నుంచి 40వేల వాహనాలు వెళ్తుంటాయి. సంక్రాంతి, దసరా పండుగల సమయంలో మాత్రం ప్రతిరోజు 50 నుంచి 60వేల వరకు వాహనాలు ఇరువైపులా రాకపోకలు సాగిస్తాయి.

10 టోల్ కౌంటర్లు విజయవాడ వైపే..

చౌటుప్పల్: పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది. మొత్తం 16 కౌంటర్లకుగాను విజయవాడ మార్గంలోనే 10 టోల్ కౌంటర్లను ఓపెన్ చేశారు. మండలంలోని హైవేపై అన్ని గ్రామాల జంక్షన్‌ల వద్ద వాహనాల రద్దీ అధికంగా ఉంది. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆయా జంక్షన్‌ల వద్ద హైవే క్రాసింగ్ చేసే స్థానికులు ఆచితూచి వెళ్లాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో విజయవాడ మార్గంలో బారులు తీరిన వాహనాలు

ప్రమాదకరంగా పద్మానగర్ జంక్షన్



కేతేపల్లి ఎస్సీ కాలనీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు

నకిరేకల్: పట్టణంలో నుంచి జాతీయ రహదారిపై పైకి వచ్చే చోట ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. నకిరేకల్‌లోని పద్మానగర్ వద్ద జాతీయ రహదారి ప్రారంభంలో గడిచిన నాలుగేళ్లలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. సంక్రాంతి పండుగకు వెళ్తున్న వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ ఇక్కడ పోలీసులు ఎలాంటి ప్రమాద నివారణ చర్యలు చేపట్టలేదు. నకిరేకల్ నుంచి జాతీయ రహదారి మీదకు వచ్చే క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు అతివేగంతో వస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

కేతేపల్లి శివారులో మూడు స్పాట్‌లు..

కేతేపల్లి మండలంలో ఇనుపాముల నుంచి ఉప్పలపహాడ్ వరకు 13కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ మధ్యలో కొర్లపహాడ్, ఇనుపాముల, కేతేపల్లి ఎస్సీ కాలనీ జంక్షన్‌లను పోలీసులు యాక్సిడెంట్ స్పాట్‌లుగా గుర్తించారు. పండుగ రద్దీ నేపథ్యంలో ఈ మూడు చోట్ల పోలీసులు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి నిరంతరం పహారా కాస్తున్నారు. ఆయా జంక్షన్‌లకు అర కిలోమీటరు ముందే సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నార్కట్‌పల్లిలో నాలుగు చోట్ల..

నార్కట్‌పల్లి మండలంలో నాలుగు ప్రమాద స్పాట్‌లు గుర్తించారు. వివేర హోటల్, గోపలాయపల్లి, ఏపీ లింగోటం, నల్లగొండ పట్టణంలోకి వెళ్లే జంక్షన్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ నాలుగు చోట్ల పోలీసులు ట్రాఫిక్ నివారణ చర్యలు చేపట్టారు.

అదనపు సిబ్బందిని నియమించాం



సంక్రాంతిని దృష్టిలో ఉంచుకొని టోల్‌ప్లాజా వద్ద, హైవే వెంట అదనపు సిబ్బందిని నియమించాం. ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు తీసుకుంటున్నాం. విజయవాడ మార్గంలో 10టోల్ కౌంటర్లు తెరిచాం. నిరంతరం పెట్రోలింగ్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తాయి. రెస్క్యూ టీంలను అందుబాటులో ఉంచాం. ఎలాంటి ఇబ్బంది ఉన్నా 1033 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. ఫాస్టాగ్ కోసం 6కౌంటర్లు ఏర్పాటు చేశాం.

– శ్రీధర్‌రెడ్డి, జీఎమ్మార్ టోల్‌ప్లాజా మేనేజర్, పంతంగి

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక అధికారులు



హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఎక్కడా ట్రాఫిక్ జాం కాకుడదనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక పోలీస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించాం. నిరంతరాయంగా 5 వాహనాల ద్వారా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. హైవేపై జంక్షన్‌ల వద్ద వాహనాలు స్తంభించకుండా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. మల్కాపురం, తూప్రాన్‌పేట శివారుల్లో క్రేన్‌లను ఏర్పాటు చేశాం. 3అంబులెన్సులను అందుబాటులో ఉంచాం. పోలీస్, జీఎమ్మార్ సిబ్బందిని మూడు రెట్లకు పెంచాం. పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద జంక్షన్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నాం. ప్రతి రోజు రాత్రి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటారు.

– నూకల ఉదయ్‌రెడ్డి, ఏసీపీ, చౌటుప్పల్

10 యాక్సిడెంట్ స్పాట్‌లు



దుర్గాపురం వై జంక్షన్ వద్ద వాహనాల రద్దీ

కోదాడ: కోదాడ నియోజకవర్గ పరిధిలో మాధవరం, మొద్దులచెరువు స్టేజీ, తాడ్వాయి స్టేజీ, మునగాల సెంటర్, ముకుందాపురం, ఆకుపాములు, కొమరబండ వైజంక్షన్, కట్టకొమ్ముగూడెం క్రాసింగ్, దుర్గాపురం వైజంక్షన్‌ల వద్ద ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంది. గతంలో ఈ ప్రదేశాలలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి.

ఇక్కడ చాలా జాగ్రత్త అవసరం..

- మాధవరం వద్ద రోడ్డు మలుపుగా ఉండడంతో పాటు నేలమర్రి క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది.
- మునగాల సమీపంలోని మొద్దుల చెరువు, త్వాడాయి క్రాసింగ్‌ల వద్ద రోడ్డు దాటేటప్పుడు ఆయా గ్రామాల ప్రజలు జాగ్రత్త వహించాలి.
- మునగాల మండల కేంద్రంలోని వైద్యశాల వద్ద ఉన్న క్రాసింగ్ ప్రమాదకరంగా ఉంది.
- మునగాల మండల పరిధిలోని ముకుందాపురం, ఆకుపాముల వద్ద ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంది. కొమరబండ వైజంక్షన్ నుంచి రాంగ్‌రూట్‌లో ఆకుపాముల వైపు నిత్యం వందల మంది ప్రయాణిస్తుంటారు. ఈ వారం రోజులు అక్కడ రాంగ్‌రూట్‌లో వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టాలి.
- కోదాడ పట్టణం లోపలికి వెళ్లే కొమరబండ వైజంక్షన్ వద్ద రోడ్డు క్రాసింగ్ చేసేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- కోదాడ బైపాస్‌లో కట్టకొమ్ముగూడెం క్రాసింగ్ రోడ్డు వద్ద గతంలో చాలా ప్రమాదాలు జరిగాయి. ఇక్కడ రోడ్డు దాటే వారు పద్మావతి కాలనీవాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- కోదాడ బైపాస్ చివరలో దుర్గాపురం స్టేజీ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉండగా, ఇక్కడ క్రాసింగ్‌తో పాటు ఖమ్మం–జడ్చర్ల ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి.

నియంత్రణ చర్యలు చేపట్టాం



పండుగ రద్దీతో కోదాడ సబ్‌డివిజన్ పరిధిలోని మాదారం నుంచి రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు వరకు మొత్తం 10 చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించి తగు నియంత్రణ చర్యలు చేపట్టాం. మునగాల, కోదాడ టౌన్, రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఇప్పటికే పికెట్‌లు ఏర్పాటు చేశాం. జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామస్తులు ఎట్టి పరిస్థితుల్లో రాంగ్‌రూట్ ప్రయాణం చేయవద్దు. నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటాం

– వెంకటేశ్వరరెడ్డి, డీఎస్పీ, కోదాడ

ప్రమాదాల నివారణకు స్టాపర్లు



చిట్యాలలో హైవే దాటేందుకు చూస్తున్న వాహనదారులు

చిట్యాల: చిట్యాల మండల పరిధిలో సుమారు 25కిలోమీటర్లకు పైగా ఉన్న హైవేపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. హైవేపై ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో పాటు జీఎమ్మార్ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హైవేపై క్రాసింగ్‌ల వద్ద, ప్రమాదాలు జరిగే చోట స్టాపర్‌లను ఏర్పాటు చేశా రు. ప్రమాదాలు జరిగిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1033కు కాల్ చేస్తే అంబులెన్స్ సౌకర్యంతో పాటు హైవేపై నిలిచిపోయిన వాహనాలను తరలించేందుకు క్రేన్ సౌకర్యం కల్పిస్తున్నారు.

ప్రమాదాలు జరిగేదిక్కడే..

చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద, వెలిమినేడు గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద, వెలిమినేడు నుంచి పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే క్రాసింగ్, పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడి సమీపంలోని క్రాసింగ్, చిట్యాల పట్టణంలోని బస్టాండ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా క్రాసింగ్, రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి వద్ద, వట్టిమర్తి గ్రామ బస్‌స్టేజీ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీస్ శాఖ గుర్తించింది. దీంతో ఇక్కడ స్టాపర్‌లను ఏర్పాటు చేశారు.

ఇలా చేస్తే మేలు..

- హైవేపై ఏర్పాటు చేసిన స్పీడ్ లిమిట్‌కు అనుగుణంగా వేగంతో వాహనదారులు ప్రయాణిస్తే మేలు.
- హైవేపై దాబాల వద్ద ఆగి ఉన్న వాహనాలు ఒక్కసారిగా రోడ్డు మీదుకు వచ్చే ప్రమాదాలున్నాయి. కాబట్టి వాహనదారులు దాబా, హోటల్స్ వద్ద పరిశీలించి వెళ్లాలి.
- నిద్రలేమితో, మద్యం సేవించి ఉన్న వాహనాలు నడపరాదు.
- అనుభవజ్ఞులైన డ్రైవర్‌లను వాహనాల్లో తీసుకెళ్తే బాగుంటుంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సంక్రాంతి పండుగ వేళ హైవేపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో అతివేగంగా వాహనాలను నడుపుతుంటారు. చిట్యాల మండలం పరిధిలో బ్లాక్‌స్పాట్‌లు ఉన్న చోట హైవేపై ప్రమాదాలు జరగకుండా స్టాపర్‌లను ఏర్పాటు చేశాం.

– నకిరేకంటి ధర్మా, ఎస్‌ఐ, చిట్యాల

చెక్ పాయింట్‌లు ఏర్పాటు



కట్టంగూర్: ప్రమాదాలు జరిగే నల్లగొండ క్రాస్‌రోడ్డు

కట్టంగూర్: మండల పరిధిలో జాతీయ రహదారి 14కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. పామనగుండ్ల, ఎరసానిగూడెం, మాణిక్యాలమ్మగూడెం, కట్టంగూర్‌లోని నల్లగొండ క్రాస్‌రోడ్డు, శ్రీకృష్ణనగర్, అయిటిపాముల గ్రామశివారులోని చెర్వుఅన్నారం బస్‌స్టాప్ సమీపంలో హైవేపై ఉన్న డివైడర్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా జీఎంఆర్ అధికారులు లైట్లు ఏర్పాటు చేశారు. ఎరసానిగూడెం స్టేజీ సమీపంలో బస్‌షెల్టర్ వద్ద పండుగ రద్దీ దృష్ట్యా పోలీసులు చెక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్ పాయింట్ వద్ద 24గంటలు విధులు నిర్వహించేలా ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ముగ్గురు పోలీసు సిబ్బందిని నియమించారు.

ఎరసానిగూడెం వద్ద చెక్ పాయింట్



సంక్రాంతి పండుగ సందర్భంగా హైవేపై ప్రమాదాలు చోటు చేసుకోకుండా మండలంలోని ఎరసానిగూడెం స్టేజీ వద్ద చెక్ పాయింట్ ఏర్పాటు చేశాం. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాల రద్దీ పెరిగింది. వాహనదారులకు సహకరించేందుకు నాతో పాటు ఏఎస్‌ఐ, ముగ్గురు పోలీసులు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నాం. హైవేపై ఉన్న డివైడర్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశాం.

– డి. విజయ్‌కుమార్, ఎస్‌ఐ, కట్టంగూర్

ఘనంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు

- వేడుకలను ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి



గాత్ర కచేరి చేస్తున్న శ్రీనిధి వెంకటేష్

భానుపురి (సూర్యాపేట): సుధా బ్యాంకు 23వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ లో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. మారుతి విద్యాసంస్థల విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రఖ్యాత శాస్త్రీయ సినీ సంగీత గాయకురాలు శ్రీనిధి వెంకటేష్ గాత్ర కచేరి నిర్వహించారు. అంతకుముందు సుధా బ్యాంక్ నుంచి త్రివేణి ఫంక్షన్ హాల్ వరకు త్యాగరాజ స్వామి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంకు చైర్మన్ మీలా మహదేవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, సుధా బ్యాంకు వైస్ చైర్మన్ నిర్మల, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి రాజా, వై .వెంకటేశ్వర్లు, గండూరి కృపాకర్, సూర్యాపేట వర్తక సంఘం అధ్యక్షుడు గండూరి శంకర్, సుధా బ్యాంకు డైరెక్టర్లు బోనగిరి భాస్కర్, అనంతుల ప్రభాకర్, శంకర్ లాల్, శ్రవణ్ కుమార్, మీలా సందీప్ కుమార్, చంద్రశేఖర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నుంచి బాలుడు అదృశ్యం

ఆత్మకూరు ఎస్: మండల పరిధిలో నెమికల్లులో పీజీఎఫ్ పాఠశాల నుంచి బాలుడు అదృశ్యమైన సంఘటన గురువారం ఆలస్యం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మోతె మండలం రవికుంటతండాకు చెందిన భూక్యా లచ్చు కుమారుడు భూక్యా నితిన్ నెమ్మికల్ పీజీఎఫ్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 8వ తేదీన పాఠశాల నుంచి ఎవరికీ చెప్పకుండా నితిన్ బయటకు వెళ్లిపోయాడని ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో నితిన్ తండ్రి లచ్చు బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినప్పటికీ ఆచూకీ దొరక్కపోవడంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మునుగోడులో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, చాలా పాఠశాలలను అద్దె భవనాలల్లో కొనసాగిస్తుండటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మునుగోడులో విలేకరులతో మాట్లాడుతూ.. మునుగోడు ఉప్ప ఎన్నిక సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మునుగోడులో ఐటీఐని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మునుగోడులో ప్రభుత్వ కళాశాలలతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ఆస్పత్రిని నిర్మించాలని కోరారు. ఇటీవల గట్టుప్పల్‌కు వచ్చిన మంత్రి కేటీఆర్ అక్కడి ఫార్మా కంపెనీని ఎలాగైతే రద్దు చేశారో అదే తరహాలో కిష్టాపురం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటచారి, పాలకూరి నర్సింహాగౌడ్, తోట నర్సింహాచారి, ఈదులకంటి కైలాస్‌గౌడ్, బొడ్డు నాగరాజుగౌడ్, మారగొని అంజయ్యగౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చీకటిగూడెం సర్పంచ్ అర్ధనగ్న నిరసన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న చీకటిగూడెం సర్పంచ్ వెంకటేశ్వరరావు

కేతేపల్లి: కేతేపల్లి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో తమ గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో అధికారులు సహకరించడం లేదని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చీకటిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ గుర్తించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకునేందుకు వస్తే ఎంపీడీఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కల్యాణలక్ష్మి దరఖాస్తులపై ధ్రువీకరణ కోసం సంతకాలు చేసేందుకు నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల తీరును నిరసిస్తూ అర్ధనగ్నంగా సభావేదిక ముందు బైఠాయించారు. కొద్దిసేపటి తర్వాత తోటి సభ్యులు, అధికారులు విజ్ఞప్తి మేరకు ఆయన ఆందోళన విరమించారు.

భూవివాదంలో ఘర్షణ.. ఐదుగురిపై కేసు

కట్టంగూర్: భూ వివాదంలో ఘర్షణ పడిన ఐదుగురిపై కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మునుకుంట్ల గ్రామానికి చెందిన ఊట్కూరి బాలనర్సమ్మ తన కొడుకు రవీందర్‌తో కలిసి పొలంలో నాటు వేస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఊట్కూరి విజయ్‌కుమార్ ఆ పొలం తనదే అంటూ నాటువేసే మడిని ట్రాక్టర్‌తో దున్నేందుకు వెళ్లాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. తన పొలం నుంచి ట్రాక్టర్‌ను బయటకు తీసుకెళ్లమని ట్రాక్టర్ ముందుభాగంలో రవీందర్ అడ్డుగా నిలబడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన విజయ్‌కుమార్ ట్రాక్టర్‌ను ముందుకు నడిపి రవీందర్‌ను ఢీకొట్టే ప్రయత్నం చేశాడు. బాలనర్సమ్మ ఫిర్యాదు మేరకు విజయ్‌కుమార్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమెదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ ఆర్. అంజయ్య తెలిపారు.

రెండు ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఢీ..

- 12 మంది ప్రయాణికులకు గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న ట్రావెల్ బస్సులు

చౌటుప్పల్ : మండల పరిధిలోని గుండ్లబావి గ్రామ స్టేజీ వద్ద బుధవారం అర్ధరాత్రి రెండు ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఢీకొనడంతో 12మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైత్రి ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడకు వెళ్తుంది. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా దాటిన తర్వాత ప్రయాణికులు మూత్రవిసర్జన కోసమని బస్సు కొద్దిసేపు నిలపాలని అడగడంతో గుండ్లబావి గ్రామస్టేజీ వద్ద డ్రైవర్ నాగేందర్‌బాబు బస్సును ఎడమవైపునకు నిలుపుతున్న క్రమంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఆరెంజ్ ట్రావెల్ బస్సు మైత్రి ట్రావెల్ బస్సును ఢీకొట్టింది. ఈ రెండు బస్సుల్లోని ప్రయాణికులు విజయలక్ష్మి, సుమలత, అచ్చుతరామయ్య, కృష్ణమూర్తి, ఎలగయ్యతో పాటు మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో మైత్రి ట్రావెల్ బస్సు వెనుక భాగం, ఆరెంజ్ ట్రావెల్ బస్సు ముందు భాగం దెబ్బతిన్నాయి. సీఐ మల్లిఖార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్సై సైదులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేయాలి



ప్రత్యేకంగా చేయించిన శాలువాని మాణిక్‌రావు థాక్రేకు అందజేస్తున్న పున్న కైలాస్

మునుగోడు: కాంగ్రెస్ పార్టీలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట వ్యహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు థాక్రేని టీపీసీసీ కార్యదర్శి పున్న కైలాస్ నేత కోరారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మాణిక్‌రావు థాక్రేను ఆయన కలసి ఇటీవల ఆయన చేనేత కార్మికుల చేత భారత్ జోడో యాత్ర జిందాబాద్ అని ప్రత్యేకంగా చేయించిన శాలువాని బహూకరించారు. ఈ సందర్భంగా కైలాస్‌నేత రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ పరిస్థితులను మాణిక్‌రావు థాక్రేకు వివరించారు. పద్మశాలీలకు రాష్ట్రవ్యాప్తంగా 10కి పైగా సీట్లు కేటాయించాలని కోరారు.

అదుపుతప్పి ఆటోను ఢీకొట్టిన కారు

- ముగ్గురికి గాయాలు





అపస్మారక స్థితిలో మహిళా టీచర్లు

గుర్రంపోడు: వేగంగా వస్తున్న కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు టీచర్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని వద్దిరెడ్డిగూడెం గ్రామ శివారులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ నుంచి నల్లగొండకు వస్తున్న ఆటోను వద్దిరెడ్డిగూడెం గ్రామ శివారులో నల్లగొండ నుంచి తానేదార్‌పల్లికి వెళ్తున్న ఆల్టో కారు టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న దేవరకొండ మోడల్ స్కూల్ టీచర్ వన్య, దేవరకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ రాజేశ్వరి తీవ్ర గాయాలపాలై స్పృహ కోల్పోయారు. ఆటో డ్రైవర్ గౌస్‌కు కూడా గాయాలయ్యాయి. మరో ముగ్గురు ప్రయాణికులు స్వల్ప గాయలతో బయటపడ్డారు. క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ రూరల్ : నల్లగొండ, కనగల్ మండలాల్లోని పలు గ్రామాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ గురువారం రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. బుద్ధారం గ్రామానికి చెందిన నామ చంద్రమ్మ తొరగల్ గ్రామానికి చెందిన పూసపాటి భద్రమ్మ, కనగల్ మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన నెలకొండ శ్రీకాంత్ మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి రూ.10 వేల చొప్పున అందజేశారు.

నేడు ముగ్గుల పోటీలు

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీషిరిడీ సాయి మందిరం ఆవరణలో సంక్రాంతి సందర్భంగా శుక్రవారం షిరిడీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కాసం లింగయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం సత్తయ్య, పోతులు రాములు తెలిపారు. ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేస్తామన్నారు.

విద్యార్థులకు అన్నదానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని గ్రామ భారతిలోగల నాగార్జున ఆవాస విద్యార్థులకు జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం దామెరభీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు అన్నదానం నిర్వహించారు. విద్యార్థులతోపాటు కలిసి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు భోజనం చేశారు. సర్పంచ్ నల్లా యాదయ్య, ఎంపీటీసీలు గండికోట రాజమణి హరికృష్ణ, బంతిలాల్, పాండు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

చండూరు : చామలపల్లి గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చామలపల్లి గ్రామానికి చెందిన రాచకొండ మోహనాచారి గురువారం ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. అధికారులు విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అర్థశాస్త్రంలో డాక్టరేట్ పొందిన లింగస్వామి



చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంకు చెందిన రుద్రవరం లింగస్వామి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అర్థ శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. ఎల్‌బిడీసీఎపీ షెడ్యూల్ కులాల జీవన విధాన మార్పు అనే అంశంపై ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు. యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్ పట్టాను అందజేశారని ఆయన గురువారం తెలిపారు.

విద్యార్థులకు అభినందన

కట్టంగూర్ : కట్టంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నకిరేకల్ నియోజకవర్గ స్థాయిలో జరిగిన బాలికల కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి పొందడంపై గురువారం జెడ్పీటీసీ తరాల బలరాములు అభినందించి రూ.10వేలను ప్రోత్సాహకంగా అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, పోగుల నర్సింహ, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ, కోఆప్షన్ సభ్యులు జానీపాష, బీరెల్లి ప్రసాద్, ఉప సర్పంచ్ అంతటి శ్రీను, దుర్గయ్య, ఎంఈఓ మేక నాగయ్య, హెచ్‌ఎం ఆర్ జ్యోతి ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాల ర్యాలీ

కేతేపల్లి : రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేతేపల్లిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రతినిధి సతీష్, శివకుమార్, జీఎమ్మార్ ప్రతినిధులు రాజేష్ పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

చండూరు : ఈ నెల 18 నుంచి జరిగే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీఓ యాకూబ్ నాయక్, వైస్ ఎంపీపీ మందడి నర్సింహారెడ్డి, ఎంపీఓ స్వరూపరాణి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పల్లె కళ్యాణి

వివేకానందుడికి ఘన నివాళి

స్వామి వివేకానంద జయంతిని గురువారం నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి చిత్రపటాలకు, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

–సాక్షి నెట్‌వర్క్



నార్కట్‌పల్లిలో 2 కే రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్లగొండ టూటౌన్ : విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్మన్ మందడి సైదిరెడ్డి



మర్రిగూడ : రక్తదానం చేస్తున్న జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, తదితరులు



నకిరేకల్ : వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు



వివేకానంద జయంతి సందర్భంగా నల్లగొండలో తోపుడు బండ్లు అందజేస్తున్న బండారు ప్రసాద్



గట్టుప్పల మండలం తేరట్‌పల్లి పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శాలిగౌరారంలో..



నల్లగొండ క్రైం : ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ



చిట్యాల: 2 కే రన్ ప్రారంభిస్తున్న సీఐ శివరాంరెడ్డి



నాంపల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలపాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

కేతేపల్లి : అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో కేతేపల్లి మండలాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలపాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. గురువారం కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారుల ప్రగతి నివేదికల ఆధారంగా ఒక్కోశాఖ పనితీరు, ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలపై ఎంపీ వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో అధికారులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ నెల 18 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల అభివృద్ధి కోసం ఇప్పటికే తన కోటా నుంచి రూ 2 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ బోళ్ళ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెదబొస్క మాధవి, మండల కోఆప్షన్ సభ్యులు అవ్వారి శౌరయ్య, ఎంపీడీఓ రమేష్‌దీన్‌దయాల్, తహసీల్దారు డి.వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కట్టంగూర్ : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులను, కుంటలను ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులు చెరువుల ఎఫ్‌టీఏ పరిధి గుర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ అవసరాల నిమిత్తం ట్రాన్స్‌కో అధికారులను ప్రజాప్రతినిధులు స్తంభాలు అడిగితే ఒక్కో స్తంభానికి రూ.3వేలు ఇస్తే తప్ప ఇవ్వబోమని ట్రాన్స్‌కో అధికారులు అంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కంటి వెలుగు 2వ విడత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 18 నుంచి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య

ప్రతి గ్రామంలో క్యాంపులు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు ఇస్తారని తెలిపారు. జెడ్పీటీసీ బలరాములు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, ఎంపీడీఓ సునిత, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీఓ అథర్‌ఫర్వేజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, అధికారులు పాల్గొన్నారు.

మునుగోడును ఆదర్శంగా తీర్చిదిద్దుతా



చల్మెడ గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు : అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న మునుగోడుకు అధిక నిధులు మంజూరు చేయించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోతులారం, చల్మెడ, కల్వకుంట్ల, చీకటిమామిడి, చొల్లేడు గ్రామాల్లో ఎస్‌డీఎఫ్, ఉపాధిహామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు రూ.50 కోట్లకుపైగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేయించి ఏ ఒక్క వీధిలో కూడా మట్టి రోడ్డు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేయిస్తానన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలుచేసి తిరిగి వచ్చే ఎన్నికల బరిలో నిలుస్తానన్నారు. ఆయా కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, పంచాయతీరాజ్ డీఈ రఘుపతి, ఎంపీడీఓ జానయ్య, సర్పంచ్‌లు జాజుల పారిజాత, తాటికొండ సంతోషసైదులు, పగిళ్ల భిక్షం, జనిగల మహేశ్వరిసైదులు, వైఎస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, ఎంపీటీసీలు చెర్కు కృష్ణయ్య, పోలగోని విజయలక్ష్మిసైదులు, వనం నిర్మలయాదయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

చిట్యాల : గ్రామాల్లో పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ అధికారులపై సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వెలిమినేడు గ్రామంలో ఇంటింటికీ మిషన్ భగీరథ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో నల్లా కనెక్షన్లు ఇవ్వలేదని, తన ఇంటికి కూడా నల్లా కనెక్షన్ ఇప్పటివరకు ఇవ్వలేదని ఆ గ్రామ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మపాపయ్య మిషన్ భగీరథ ఏఈలు రమేష్, అరుణ్‌కుమార్‌లను నిలదీసింది. ఎలికట్టెలో గ్రామంలో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం లేదని ఆ గ్రామ ఎంపీటీసీ గొలనుగొండ దశరథ అధికారులను నిలదీశారు. గ్రామాల్లో వీధుల్లో నల్లా కనెక్షన్ల కోసం తవ్విన సీసీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని వెలిమినేడు ఎంపీటీసీ దేశబోయిన స్వరూపనర్సింహ అధికారులను డిమాండ్ చేశారు. చిట్యాల విద్యుత్ ఏఈగా విధుల్లో చేరినప్పటినుంచి హాజరు కాకుండా కిందిస్థాయి అధికారులను సమావేశాలకు పంపించడం పట్ల వెలిమినేడు సర్పంచ్, ఎలికట్టె ఎంపీటీసీ నిరసన వ్యక్తం చేశారు. వెలిమినేడు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు కోరారు. గుండ్రాంపల్లి గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ విధులకు హాజరు కావడం లేదని వెంటనే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునిత

లైన్‌మెన్‌ను తొలగించాలని ఆ గ్రామ సర్పంచ్ రత్నం పుష్పనర్సింహ కోరారు. గుండ్రాంపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను ఎప్పుడు పంపిణీ చేస్తారని మండల కోఆప్షన్ సభ్యుడు మోసీన్ ప్రశ్నించగా.. లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నాయబ్ తహసీల్దార్ రాగ్యానాయక్ తెలిపారు. అధికారులు సమావేశాలకు సకాలంలో హాజరు కావాలని, లేనట్లయితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్ సభలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభలో కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు చిట్యాల, వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు కిరణ్‌కుమార్, నర్సింహ అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి సగానికిపైగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకాలేదు. ఎంపీడీఓ బి.లాజర్, వైస్ ఎంపీపీ మర్ల అలివేలురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

శాలిగౌరారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోగా కనీసం ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను కూడా సమావేశానికి అందించకపోవడం గమనార్హం. మండలంలోని ప్రధాన సమస్యలు సమావేశంలో చర్చించే సమయంలో ఆయా శాఖలకు సంబంధించిన మండల అధికారులు సమావేశంలో లేరు. అధికారుల నిర్లక్ష్యం తీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూడాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీపీని కోరారు. ఏ సమస్యను ప్రస్తావించినా అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఎమ్మెల్యే గాదరి కిశోర్ హాజరయ్యే సమయానుకూలతను బట్టి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

ఎవరిగోల వారిదే...

మండల సర్వసభ్య సమావేశంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఎవరిగోల వారిదే అనే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మమ్మ

చందంగా వ్యవహరించారు. సభ్యులు ఇష్టానుసారంగా సమావేశ మందిరంలోకి రావడం, బయటకు వెళ్లిపోవడం, సెల్‌ఫోన్లు మాట్లాడడం జరిగింది. ఎంపీపీ గంట లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తేజస్వి, జెడ్పీటీసీ ఎర్ర రణీల, వైస్‌ఎంపీపీ కందుల అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నల్లగొండ రూరల్ : సబ్సిడీ బియ్యం కోటాను యథావిధిగా పంపిణీ చేయాలని కోరుతూ గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు కవితకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు భవిష్యత్

నల్లగొండ రూరల్ : కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మంచి భవిష్యత్ ఉందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్ అన్నారు. గురువారం కనగల్ మండల ఓబీసీ కమిటీని నియమించిన అనంతరం ఆయన మాట్లాడారు. మాజీ మార్కెట్ చైర్మన్ భిక్షంయాదవ్, నర్సింగ్ కృష్ణ, పెద్దులు, గణేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, వెంకట్‌రెడ్డి, కోటయ్య, చర్లపల్లి గౌతం, అంజయ్య, గంగయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

మర్రిగూడ : బీసీ కులాల గణన చేసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలుచేయాలని బీఎస్పీ జిల్లా ఈసీ మెంబర్ పల్లేటి రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు గండు నాగేంద్రబాబు, మండల అధ్యక్షుడు గిరి నర్సింహ, బొట్ల శివ,తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

చండూరు : పండుగకు కానీ, ఏదైనా విహార యాత్రలకు కానీ ప్రజలు వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి ఆభరణాలను, డబ్బులను విధిగా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచుకోవాలని చండూరు, గట్టుప్పల ఎస్ఐలు నవీన్‌కుమార్, సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఊరికి వెళ్లేముందు ఇంటి ముందు మెయిన్ గెట్‌కు తాళం వేయవద్దన్నారు. ఇంటి ముందు రూమ్‌లో కనీసం ఒక లైట్ వెలిగి ఉండేలా చూసుకోవాలన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన

మర్రిగూడ : మండలంలోని కొండూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు గురువారం అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద మాట్లాడుతూ చిన్నారులకు ఆరు నెలలు నిండిన వెంటనే అదనపు ఆహారం ఇవ్వాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సమ్మ, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ టీచర్ శోభ పాల్గొన్నారు.

మాల మహానాడు అధ్యక్షురాలిగా స్రవంతి

మునుగోడు : మాల మహానాడు మునుగోడు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా మునుగోడుకు చెందిన ముచ్చపోతుల స్రవంతిని నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి గురువారం నియామక పత్రం అందించారు. స్రవంతి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కనీస వేతనం అమలుచేయాలి

నల్లగొండ టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు, గొర్రెలకు, మేకలకు వైద్య సేవలు అందిస్తున్న పశుమిత్రలకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా జరిగిన పశుమిత్రల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.మనీషా, ప్రధాన కార్యదర్శిగా అండెం సునిత, కోశాధికారిగా ఎస్‌కె హస్మ, ఉపాధ్యక్షులుగా ఎం.మంజుల, జె.రాధిక, సహాయ కార్యదర్శులుగా ఎండీ మొహరాజ్, సీహెచ్ దుర్గాభవాని, మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : ఖమ్మం వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుపై దాడిచేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రవూఫ్, రాష్ట్ర కన్వీనర్ నల్ల సోమమల్లయ్య గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోగి చనిపోతే విచారణ జరిపి, చర్యలు తీసుకునేందుకు చట్టప్రకారం నడుచుకోవాలన్నారు.

మాలలకు ప్రాధాన్యత కల్పించాలి

నల్లగొండ రూరల్ : మాలలకు రాజకీయంగా అన్ని పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా కామర్ల నరేష్‌ను నియమిస్తు ఉత్తర్వుల కాపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి బాలకృష్ణ, గుండాలు, పున్నమ్మ, నగేష్, సురేష్, వెంకన్న, అర్జున్, రాజారాం, స్వర్ణ, సావిత్రి పాల్గొన్నారు.

●పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



నల్లగొండ : శాస్త్ర పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



నల్లగొండలోని సంస్కృతి హైస్కూల్‌లో..



నల్లగొండలోని చైతన్య స్కూల్లో..



మునుగోడు : ఎస్ఎస్ఎస్ఆర్ పాఠశాలలో..



నకిరేకల్ : శాస్త్ర పాఠశాలలో..



కట్టంగూర్ : సాందీపని పాఠశాలలో ..

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ : మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి ఆవిష్కరించారు. జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, ఏపాల సత్యనారాయణరెడ్డి, కొప్పు రాంబాబు, బాలరాజ్‌రెడ్డి, యాకుబ్‌నాయక్, యాదగిరి, జ్యోతి లక్ష్మి, నరేందర్ రెడ్డి, సోమేష్ తదితరులు పాల్గొనారు.

'కాంగ్రెస్‌తో పొత్తు టీడీపీకి తీవ్ర నష్టం'

మునుగోడు : గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోవడం వల్లే టీడీపీకి తీవ్ర నష్టం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. మునుగోడులో నూతనంగా ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కార్యాలయం ఎదుట పార్టీ జెండాను ఎగురవేశారు. పార్లమెంటరీ అధికార ప్రతినిధి మక్కెన అప్పారావు, మండల అధ్యక్షుడు ఏర్పుల సుదర్శన్, లింగయ్య, పార్వతమ్మ, లింగయ్య, షరీఫ్ ఉన్నారు.

క్రీడలు ఐక్యతకు దోహదపడుతాయి

కేతేపల్లి : యువతలో ఐక్యతను పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలను మండల ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కాసేపు కబడ్డీ, వాలీబాల్ ఆడి యువతను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి క్రీడలు నిర్వహించడం ద్వారా గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చని అన్నారు. నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, సర్పంచులు కొండ సరితసైదులు, గోలి మంజులవేణుమాధవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ అలుగుబెల్లి సంజీవరెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, నాయకులు చల్ల కృష్ణారెడ్డి, మందడి సత్యనారాయణరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతితో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

మద్దతు ధర కల్పించాలి

మర్రిగూడ : కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15వేలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.